క్లుప్తంగా

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కిశోర్‌కుమార్ సూచించారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


మహిళల కోలాట ప్రదర్శన

లావేరు: లావేటిపాలెం గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి తమలపాకులు, పసుపు, కుంకుమతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో లావేటిపాలెం, లావేరు, కేశవరాయునిపురం, జీజీవలస గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు పాల్గొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయ విద్య పునరుద్ధరణకు చర్య తీసుకోవాలి


రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడేళ్ల న్యాయ విద్య (ఎల్ఎల్‌బీ) కోర్సు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వర్సిటీ పరిపాలన కార్యాలయంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు విడతల కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు జరగకపోవటంతో జిల్లా విద్యార్థులు నష్టపోతున్నారని, వర్సిటీలో దశాబ్దాలుగా నిర్వహిస్తున్న కోర్సు లేక పోవటం ఆందోళన కలిగిస్తోందన్నారు. న్యాయ విద్యకు బార్ కౌన్సెలాఫ్ ఇండియా గుర్తింపు కోసం కృషి చేయాలని, అవసరమైన వసతులు, బోధకులను నియమించాలన్నారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఏబీవీపీ ప్రతినిధులు సతీష్, అచ్చెన్నాయుడు తదితరులున్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన


లావేరు: లింగాలవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: కుష్టువ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. లెప్రసీ వారోత్సవా ల్లో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పర్యటించి అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. కుష్టువ్యాధి ఎలా వస్తుంది, నివారణ చర్య లు ఏమిటి, వ్యాధి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్త లను వివరించారు. కార్యక్రమంలో సచివాలయాల ఏఎన్ఎంలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఎంఎల్‌హెచ్‌పీ లు, ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండల పరిధిలోని అన్ని గ్రామ సచి వాలయాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. జి.సిగడాంలో ఎంపీపీ మీసాల సత్యవతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వైద్యాధికారిణి పొన్నాడ హరితాశ్రీ, పంచాయతీ కార్యదర్శి సాహు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తిరి మోహన్, ముద్దాడ గౌరీ, ఎంఎల్‌హెచ్ పి.రమాదేవి, ఏఎన్ఎం వై.నాగమణి, సచివాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడు గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి

జి.సిగడాం: జగన్నాథపురం, నర్సింహంపురం, గంగన్నదొరపాలెం, గేదెలపేట, ఆనందపురం తోపాటు మరో 15 గ్రామాల్లో భూముల రీసర్వే వేగంగా చేపట్టారు. వీటిలో ఏడు గ్రామాల్లో పూర్తి సర్వే చేపట్టి రైతులకు హక్కు పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, డీటీ నిర్మల, ఆర్ఐలు రామచంద్రరావు, హనుమంతరావు సమక్షంలో సర్వేను పూర్తి చేస్తున్నారు.

జోరుగా అభివృద్ధి పనులు

జి.సిగడాం:సంతవురిటిలో గడపగడపకు నిధులతో పలు అభివృద్ధి పనులు జోరు గా జరుగుతున్నాయి. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఇటీవల నిర్వహించిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సమస్యలను గుర్తించారు. వాటిని తక్షణమే పరిష్కారం చేయడానికి నిధులను మంజూరు చేశారు. సర్పంచ్ బుడారి లక్ష్మణరావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా జగనన్న సచివాలయ కన్వీనర్లు క్రియాశీలకంగా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంపరిధిలోని జగనన్న సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు గృహ సారథులతో సమన్వయం చేసుకుని గ్రామ ప్రగతి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అందజేయడం వంటి క్రియాశీలకమైన అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. గ్రామాల్లోని ఒకరిద్దరూ నాయకులు సక్రమంగా పనిచేయకపోతే ఆ ప్రభావం పార్టీపై పడుతోందన్నారు. అందుకే ఎప్పటికప్పుడు గ్రామ సచివాలయ పరిధిలోని నాయకులతో, కార్యకర్తలతో, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కావాల్సిన అంశాలపై చర్చించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సమయంలోనే గ్రామాల్లో తిరుగుతామంటే కుదరదని, నిత్యం ప్రజలతో మమేకమై ఉంటేనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోగలమన్నారు. రోజూ రెండు సచివాలయాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు కలిసికట్టుగా సమావేశాలు నిర్వహించి గ్రామాల్లో ప్రగతి బాటలు వేయాలన్నారు. సమావేశంలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల జగనన్న సచివాలయ కన్వీనర్లు చిల్ల వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, మూగి శ్రీరాములు, డోల వెంకటరమణ, నాయకుడు గొర్లె అప్పలనర్సునాయుడు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల వర్తింపు

● వైఎస్సార్ సీపీ యువ నాయకుడు రామ్‌మనోహర్‌నాయుడు
● చల్లపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

గార: అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. అంపోలు పంచాయతీ పరిధిలోని చల్లపేట గ్రామంలో సర్పంచ్ గొండు జయరాం ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేకూర్చిన లబ్ధి వివరాలను తెలియజేసి అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ పథకాలను ఎవరు అమలు చేశారు, ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలో కూడా అమలు జరగడం లేదన్నారు. మన రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు దేశంలోని అనేక రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, కన్వీనర్ పీస శ్రీహరిరావు, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, నాయకులు పీస గోపి, యాళ్ల నారాయణమూర్తి, గంగు రామారావు, ముద్దాడ గోవిందరావు పాల్గొన్నారు.

భద్రత అందరి బాధ్యత

● జేఆర్‌పురం సీఐ ఆదాం


మాట్లాడుతున్న సీఐ ఆదాం

ఎచ్చెర్ల: రహదారి భద్రత అందరి బాధ్యతని జేఆర్ పురం సీఐ ఎస్.ఆదాం అన్నారు. చిలకపాలెంలోని నాగార్జున అగ్రికెం పరిశ్రమ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులతో పరిశ్రమ ప్రాంగణం నుంచి చిలకపాలెం జంక్షన్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. భద్రత లేనిదే భవిష్యత్తు లేదన్నారు. ప్రతిఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్ఏసీఎల్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు తమ దైనందిన కార్యక్రమంలో భాగంగానే భద్రత జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీడీ డిపార్ట్‌మెంట్ హెడ్ కె.శ్యాంప్రసాద్, డీజీఎం పీఎస్‌వీఎస్ వర్మ, ఎచ్చెర్ల ఎస్సై సత్యన్నారాయణ పాల్గొన్నారు. ఉత్తమ ఆటో డ్రైవర్లకు ఎన్ఏసీఎల్ తరపున జ్ఞాపికలు అందజేశారు.

జాతరకు భారీ బందోబస్తు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదాం

రణస్థలం: కమ్మసిగడాం జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని జె.ఆర్.పురం సీఐ ఎస్.ఆదాం తెలిపారు. సోమవారం ప్రారంభమైన జాతరలో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరలోకి ప్రవేశించేందుకు వీలుగా యాగాటిపాలెం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామన్నారు. కమ్మసిగడాం, దేవరాపల్లి, వెల్పురాయి వైపు నుంచి వచ్చేవారికి కిలోమీటర్ ముందుగానే వాహనాలు నిలిపి వేస్తున్నామని చెప్పారు. జాతరలోకి ఎటువంటి వాహనాలు అనుమతించడం లేదన్నారు. జేబు దొంగలు, అల్లరి మూకలను పట్టుకోవడానికి మఫ్టీలో ప్రత్యేక పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. జాతర విధులకు ఎనిమిది మంది ఎస్సైలు, వంద మంది కానిస్టేబుళ్లు, 20 మంది మహిళ పోలీసులను కేటాయించామన్నారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ ఉన్నారు.

లెప్రసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం కల్చరల్: మహాత్మాగాంధీ వర్ధంతి, జాతీయ కుష్టువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని లెప్రసీ కాలనీలో భగవాన్ సత్యసాయి సేవా సమితి పెద్దమందిరం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. తొలుత వైద్యులు డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్, డాక్టర్ ఎల్.సోమశేఖర్‌లు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుమారు వందమందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మందిరం ఫార్మాసిస్టు సూపర్‌వైజర్ ఎ.వెంకటేశ్వరరావు, ఫార్మాసిస్టు పి.రమణమూర్తి, జెమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగి రమణమూర్తి, లెప్రసీ కాలనీ సభ్యులు పాపారావు, అప్పారావు పాల్గొన్నారు.

మంచినీటి సదుపాయం కల్పించాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మంచినీటి సదుపాయం కల్పించాలని ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గ్రామానికి చెంది న మూగి గురుమూర్తి, గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో డి.మత్స్యలేశం, రాళ్లపేట, కొత్త మత్స్యలేశం, శివాజీ దిబ్బలపాలెం, కొత్త దిబ్బలపాలెం గ్రామాలు ఉన్నాయని.. స్థానికంగా వైశాఖి బయో మెరిన్ ఫ్యాక్టరీ ఉండడంతో నీరు కలుషిత అవుతోందని వివరించారు.

విష్ణు సహస్ర నామ పారాయణ రేపు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఫిబ్రవరి ఒకటో తేదీన భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్నట్లు ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విష్ణు సహస్రనామ శ్లోక కంఠస్థ పోటీలు జరుగుతాయన్నారు.

మురపాక గ్రంథాలయాధికారికి సేవా పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

లావేరు: మురపాక శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఉత్తమ సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారికి హైదారాబాద్‌కు చెందిన స్పందన ఇదా ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ వారు ఉత్తమ పురస్కారాలకు పలువురిని ఎంపిక చేసింది. శ్రీనివాసరావు ఉత్తమ సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో ఆ సంస్థ ఈయన్ని పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఇదా శ్యాముల్‌రెడ్డి, ఎస్‌హెచ్‌కే అకాడమీ చైర్మన్ ఎస్‌హెచ్ కులకర్ణిలు పురస్కారాన్ని శ్రీనివాసరావుకు ప్రదానం చేశారు. ఈనెల 26వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కూడా జిల్లా కలెక్టర్ శ్రీకేష్‌బి.లాఠకర్ నుంచి జిల్లా ఉత్తమ గ్రంథాలయాధికారిగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు.

సీఎం జగన్‌కు సిక్కోలంటే అభిమానం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీకాకుళం నియోజకవర్గమంటే ప్రత్యేక అభిమానమని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. అభివృద్ధే తారక మంత్రంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు పనిచేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ కూడలి నుంచి రామలక్ష్మణ జంక్షన్ వరకు రోడ్డు అభివృద్ధి పనులకు రూ 68.98 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో రోడ్డు పనులకు రామ్‌మనోహర్ నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇటీవల కాలంలో శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ. 2.15 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కిష్టప్పేట నుంచి సింగుపురం వరకు రూ. 47 లక్షలతో, సింగుపురం నుంచి తండ్యాంవలస వరకు రూ. 54.30 లక్షలు, బలగ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్–5 వరకు రూ 44.41 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, నాయకులు సాధు వైకుంఠరావు, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, జె.ఎం.శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

చిరునవ్వే సీఎం జగన్ లక్ష్యం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
● కొత్తకుంకాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


గ్రామస్తులకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కొత్తకుంకాం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి.. అందరినీ ఆప్యాయతగా పలకరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మూడున్నరేళ్ల కాలంలో చేకూరిన లబ్ధిని తెలియజేసి..అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలన్న ఉద్దేశంతో నవరత్నాలు పేరుతో సంక్షేమ పథకాలు మంజూరు చేసి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేరువ చేస్తున్నామన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, బూత్ కమిటీ మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరా వు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయు డు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు, జిల్లా వ్యవసా య సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయు డు, కొత్తకుంకాం ఎంపీటీసీ సభ్యుడు దొండపాటి శివ, నాయకులు దొండపాటి వాసు, సూర్యారావు, చింతాడ భాస్కరరావు, లంకలపల్లి రమణ, ఇసర్ల సూర్యారావు, పెరుమాళ్ల రమణ, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, పంచాయతీ అధికారి వి.విశ్వేశరరావు, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కె.అప్పలనాయుడు, ఎల్.అప్పన్న, బి.శివకుమార్, ఏవో మహేష్‌నాయుడు, ఆర్ఐ రామచంద్రరావు, ఏపీఎం ఎం.మాధవీలత, ఏపీవో ఆర్.సత్యవతి, పంచాయతీ కార్యదర్శి కె.నీలయ్య, వీఆర్వో ఎం.శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు అనుసరణీయం

● బీఆర్ఏయూ వీసీ వెంకటరావు


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు అనుచరణీయమని బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. ఆయన ప్రపంచానికే ఆదర్శప్రాయులని కొనియాడారు. గాంధీ మందిరం భారత స్వాతంత్ర్య స్మృతి వనం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గాంధీ స్మారక నిధి, గాంధీ మార్గ్ ఇండియా ఫౌండేషన్, గాంధీ మందిర కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నగరంలోని శాంతినగర్ కాలనీలో సోమవారం గాంధీ విగ్రహానికి ప్రతినిధులంతా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన పోరాట యోధులు గాంధీ అనుసరించిన విధానాలకు ఆకర్షితులయ్యారన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో గాంధీ ఆలోచనా విధానాలపై పీజీ డిప్లొమో కోర్సు ఉందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేషు మాట్లాడుతూ.. గాంధీ మందిర నిర్మాణం, అభివృద్ధిలో కార్పొరేషన్‌ను భాగస్వామ్యం చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. గాంధీమార్గ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి సురంగి మోహనరావు మాట్లాడుతూ.. గాంధేయం కోసం జిల్లాలో కలిసి పనిచేసే వారందరితో ముందుకు నడిపిస్తున్నామన్నారు. గాంధీ స్మారకనిధి ప్రతినిధి ఎం.ప్రసాదరావు మందిరం నిర్మాణం, ఐదేళ్లుగా చేపడుతున్న కార్యక్రమాలను నివేదించారు. ప్రొఫెసర్ విష్ణుమూర్తి, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, కొంక్యాన వేణుగోపాల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మందిర అభివృద్ధికి కృషి చేసిన సంఘ సేవకులు పి.వి.ఎస్.రామ్మోహన్, వడ్డి లక్ష్మణరావు, కేర్ టేకర్ రాజారావులను వీసీ, కమిషనర్ సత్కరించారు. బీఆర్ఏయూ పాలకవర్గ సభ్యుడు బరాటం లక్ష్మణరావు, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, మంది ర కమిటీ అధ్యక్షుడు చింతాడ కృష్ణమోహన్, కమిటీ ప్రతినిధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, ఇంటర్మీడియెట్ బోర్డు విశ్రాంత జేడీ ఎం.ఎ.ఎస్. భట్లు, రిటైర్డ్ డీఈఈవోలు గవర గోవిందరావు, కరణం గోవిందరాజులు, పైడి హరనాథ్ పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

లావేరు: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పెదలింగాలవలస సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం తేవడానికి గాంధీజీ ఎంతో కృషి చేసి మహాత్ముడుగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, నాయకులు యందవ శ్రీనివాసరావు, మీసాల నారాయణరావు, మజ్జి సత్యం, పతివాడ గురునాయుడు, దన్నాన రాంబాబు, లుకలాపు లక్ష్మణరావు, గొర్లె సూర్యనారాయణ, బాబ్బాది బీమయ్య, వాళ్లే రమణ, పైల శ్రీను, పొన్నాడ మల్లేషు పాల్గొన్నారు.

దవళపేటలో..

జి.సిగడాం: గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని న్యాయవాదుల సంఘం రాజాం అధ్యక్షుడు కంచరాన రమణమూర్తి , న్యాయవాది పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. దవళపేట గ్రామంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తిరి మోహన్, పేడాడ శ్యామలరావు, బొద్దేపల్లి ఉదయ్‌కుమార్, పేడాడ స్వాతినాయుడు, నారాయణరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

శ్రీకాకుళం రూరల్: గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. మండల మెజిస్ట్రేట్ ఎస్.వెంకట్రావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహాత్మగాంధీ సేవలు చిరస్మరణీయమని అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు అన్నారు. గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యం, అహింస సిద్ధాంతాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నక్క రామకృష్ణ, రౌతు శంకరరావు, వేణు పాల్గొన్నారు.


జి.సిగడాం: దవళపేటలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


లావేరు: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


శ్రీకాకుళం రూరల్: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నెరవేరనున్న జిల్లా ప్రజల కల


బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: జిల్లా ప్రజల కలను నెరవేర్చనున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా రుణపడి ఉంటారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ఇసుకలపేట గ్రామం సమీపంలో నాగావళి నదీతీరంపై నిర్మించనున్న బలసలరేవు బ్రిడ్జి నిర్మాణానికి ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నాగావళి నదిపై బ్రిడ్జి నిర్మాణంతో ఆమదాలవలస, శ్రీకాకుళం, రాజాం నియోజకవర్గ ప్రజల వ్యాపార, రవాణాకు అనుకూలంగా ఉంటుందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.87 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ బ్రిడ్జి పనులను ఫిబ్రవరిలో సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన సీఎం జగన్‌కు జిల్లా ప్రజలు తరపున ధన్యావాదాలు తెలియజేశారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇచ్ఛాపురం నుంచి రాజాం వరకు సుమారు 80 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.కాంతిమతి, ఈఈ రవినాయక్, డీఈ జాన్ వీక్లీస్, జేఈ ఆంజనేయనాయక్, ఆర్డీఓ బి.శాంతి పాల్గొన్నారు.